


## వైసీపీ ప్రభుత్వంలో
# వేధింపులు,బెదిరింపులు



**విశాఖపట్నం, –నవభూమి:** గత ప్రభుత్వంలో పాలకులు, వారి వందిమాగధుల వేధింపులు, బెదిరింపులతోక్వారీలు మూసేసుకోవాల్సి వచ్చిందని, దాంతో కొంతమంది అప్పుల పాలవ్వడం జరిగిందని క్వారీ యజమానులు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం జడ్పీ హాలులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన క్వారీ, క్రషర్స్, గ్రానైట్ క్వారీ యజమానులు, అధికారులతో గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులను నిర్భయంగా చెప్పాలని సూచించినప్పుడు పలువురు క్వారీ యజమానులు అనుభవాలను ఏకరువు పెట్టారు. అనకాపల్లి ప్రాంతంలో క్వారీలు నిర్వహించే వెంగమాంబ శ్రీనివాస్ మాట్లాడుతూ తనిఖీల పేరిట విపరీతంగా వేధింపులకు పాల్పడడమే కాకుండా బెదిరించారని ఫిర్యాదు చేశారు. కొందరు అధికారులు బరితెగించి ప్రవర్తించడంతో వ్యాపారం నిలిపివేశానన్నారు. ఇంకా ఈసీ అనుమతుల విషయంలో ఇబ్బందులున్నాయని చెప్పడంతో మంత్రి స్పందిస్తూ త్వరలో సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనకాపల్లికి చెందిన మరో క్వారీ యజమాని నరసింహరాజు మాట్లాడుతూ లీజుల మంజూరులో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. కుంచంగి గ్రామానికి చెందిన క్వారీ ఓనర్ జగ్గారావు మాట్లాడుతూ క్వారీకి సంబంధించి ఈసీ అనుమతి అనేది ప్రహసనంగా మారిందన్నారు. పరవాడ మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాధంశెట్టి నీలబాబు మాట్లాడుతూ రాజకీయంగా వేధించారని, జీవీఎంసీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరించారన్నారు. వినకపోవడంతో క్వారీని నిలుపుదల చేశారన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన నాగరాజు మాట్లాడుతూ భీమిలి మండలం దాకమర్రిలో కొంతమందితో కలిసి నిర్వహిస్తున్న క్వారీని తనిఖీ చేసి రూ.ఎనిమిది కోట్లు జరిమానా విధించారన్నారు. తామంతా టీడీపీ సానుభూతిపరులం కావడంతో వేధించారని వాపోయారు. క్వారీ యజమానుల సమస్యలు విన్న మంత్రి బదులిస్తూ గత పాలకులు గనుల శాఖను సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. క్వారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంఎఫ్ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్) సెస్‌ను స్థానికంగా ప్రభావితమైన గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. క్వారీల లీజుల కోసం పర్యావరణ అనుమతులు మంజూరుకు ఒక కమిటీని ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. లీజుల్లో అడ్డంకులు తొలగిస్తామని, వ్యాపారులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ క్వారీ యజమానులు నిజాయితీగా వ్యవహరించాలని, గత ప్రభుత్వంలో ఏర్పడిన ఇబ్బందులు కూటమి ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. సమావేశంలో పెందుర్తి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నేత దాడి రత్నాకర్ మాట్లాడారు. గనుల శాఖ ఏడీ జగన్నాథరావు స్వాగతం పలకగా, మంత్రికి పలువురు క్వారీ యజమానులు వినతిపత్రాలు అందజేశారు.

## జాతి ఐక్యతకు పునాదులు వేసిన
# సర్దార్ వల్లభాయ్ పటేల్




## తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు
# దీపావళి శుభాకాంక్షలు

**అమరావతి: –నవభూమి:** తెలుగు ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు."నరకాసుర వధ తర్వాత ఇంటింటా దీపాలు వెలిగించుకొని సంతోషంగా నిర్వహించుకొనే వెలుగుల పండుగ దీపావళి. ఒక దీపాన్ని వెలిగించడం ద్వారా మన చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలినట్లుగా.. సూపర్–6 హామీల్లో భాగంగా 'దీపం 2.0' పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నాం. తెలుగింటి ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం చూసేందుకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.అర్హులైన మహిళలు ఇప్పటికే ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇది ఎంతో సంతోషించదగిన విషయం. వారి నుంచి వస్తున్న స్పందనతో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసేలా



స్ఫూర్తిని పొందుతున్నాం. ఈ ఆనంద దీపావళి.. రాష్ట్ర ప్రజల జీవితంలో కొత్త వెలుగులు నింపాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

# మళ్లీ సాయిరెడ్డేనా!?

**విశాఖపట్నం–నవభూమి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా మళ్లీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని నియమించడంపై కొంతమంది నేతలు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఆయన వ్యవహారశైలి కారణంగానే ఉత్తరాంధ్రలో పార్టీకి పూడ్చుకోలేని నష్టం జరిగిందని ఆరోపిస్తున్నారు. అలాంటి వ్యక్తిని తిరిగి సమన్వయకర్తగా నియమించడం వల్ల పార్టీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండదని వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు నేతలు మాత్రం సాయిరెడ్డి రాకతో కార్యకర్తలో ఉత్సాహం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.వైసీపీ ఆవిర్భావం తర్వాత ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా వైవీ సుబ్బారెడ్డి కొంతకాలం పనిచేశారు. 2019 ఎన్నికలకు ముందు సమన్వయకర్త బాధ్యతలు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి అప్పగించారు. 2024 ఎన్నికలకు దాదాపు రెండేళ్ల ముందు వరకూ ఆయనే కొనసాగారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్రలో ప్రధానంగా విశాఖ జిల్లాలో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు, భూ కేటాయింపులలో విజయసాయిరెడ్డి చక్రం తిప్పారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం మొత్తం విజయసాయిరెడ్డి కనుసన్నల్లోనే పనిచేసేది. విశాఖలో విలువైన ప్రైవేటు భూములను బెదిరించి లాక్కున్నారని, దసపల్లా భూముల బదలాయింపు, ప్రభుత్వానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలు మార్పిడి వంటి వ్యవహారాల్లో విజయసాయిరెడ్డి కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.ఇక పార్టీలో కూడా కొందరికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, తనకు గిట్టని ప్రజాప్రతినిధులు, నేతలను దూరంపెట్టేవారు. వారికి పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యం లేకుండా చేసేవారు. ఈ నేపథ్యంలో పార్టీ అధికారంలో ఉండగానే విశాఖ ఎంపీగా ఉన్న ఎంవీవీ సత్యనారాయణ ప్రెస్‌మీట్ పెట్టి మరీ విజయసాయిరెడ్డి తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. విజయసాయిరెడ్డిపై ముఖ్యమంత్రిగా ఉన్న పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి భారీగా ఫిర్యాదులు వెళ్లడం, ఇంటెలిజెన్స్ నివేదికలు వ్యతిరేకంగా అందడంతో 2024 ఎన్నికలకు రెండేళ్ల ముందు ఆయన్ను సమన్వయకర్తగా తొలగించి, వైవీసుబ్బారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. విజయసాయిరెడ్డిని విశాఖ వెళ్లొద్దని కూడా జగన్ ఆదేశించినట్టు అప్పట్లో పార్టీలో ప్రచారం జరిగింది.



## శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే




**దెందులూరు అక్టోబర్ 30 నవభూమి** విద్యార్థులు సీనియర్ జూనియర్ అనే తేడా లేకుండా చక్కగా కలిసి మెలిసి వ్యాయామ విద్యను అభ్యసించాలని ర్యాగింగ్ భూతం జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని దెందులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు . గోపన్నపాలెం గ్రామం మాజీ సర్పంచ్ మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు) అన్నారు. బుధవారం దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియల్ ఆధ్వర్యంలో వ్యాయామ విద్యలో విద్యార్థులకు మొదటి సంవత్సరంలో వస్తున్న విద్యార్థులకు స్వాగతం పలికకే ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆత్మీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు తాసిల్దార్ బి సుమతి. గోపన్నపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతా సుబ్బారావు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ మిల్లు బాబు. ఉపాధ్యాయులు డాక్టర్ దిలీప్. డాక్టర్ డి రత్నబాబు తదితరులతో కలిసి విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఆఫీస్ బేరర్ ఎల్ వెంకటేశ్వరరావు.టిడిపి నేతలు మారగాని సత్యనారాయణ. ఏనుగు కేబుల్ శీను. కోలాంటి లక్ష్మి భవాని. ప్రసాద్. తెలుగు యువత నేత చందు. మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు. టిడిపి జనసేన భాజపా నేతలు ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారుల

## కేఎన్ పురం నాయకుల ఉద్యమానికి కాపు సంఘం మద్దతు



**దెందులూరు –నవభూమి:** విజయవాడ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన పేరును తొలగించడం పై కంద్రిగ నరసింహాపురం అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు చేస్తున్న పోరాటానికి కాపు సంఘం మద్దతు ప్రకటిస్తోందని దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం అధ్యక్షులు వైఎస్ఆర్సిపి జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు అన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు తొలగించారని ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన దానిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు ఇప్పుడు ఏకంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన పేరుని తొలగించడం క్షమించరాని విషయం అన్నారు భవిష్యత్తులో అంబేద్కర్ విగ్రహాన్ని అక్కడ నుంచి తరలిస్తారన్న అనుమానం కలుగుతోందన్నారు ఈ ప్రయత్నం గాని ఈ ఆలోచన గాని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశ గర్వించేలా ప్రపంచ మేధావి. రాజ్యాంగ నిర్మాత. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తిని ఆశయాన్ని అందరికీ ఆదర్శంగా ఉండేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 125 అడుగుల ఎత్తు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తే జీర్ణించుకోలేకపోవడం దుర్మార్గం అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని అక్కడ నుంచి తరలించిన ఆ ప్రయత్నాలు చేసిన కుట్రలు పన్నిన కంద్రి నరసింహపురం అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు చేస్తున్న పోరాటంతో పాటు తమ తమ సంఘం పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని అక్కడ నుంచి తరలించే ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించేది లేదని అన్నారు.

### ఆదోనిలో అడుసు తొక్కనేల..

# కాలు కడగనేల?

మేసా డేవిడ్, రీజినల్ కో–ఆర్డినేటర్

**ఆదోని, అక్టోబరు 30(నవభూమి ప్రతినిధి) :** డాక్టర్ ఆదోని ఎంఎల్ఏ!! అందులోనూ బీజేపీ ఎంఎల్ఏ!!! పబ్లిక్‌లో క్రేజీ లీడర్... మాస్‌లీడర్. పైగా డేరింగ్ అండ్ డాషింగ్ మాస్ లీడర్. కూటమిలో ఉన్న తెదేపా నాయకులపైనే తన మాటల గూటం తీసుకుంటారు. ముఖ్యంగా తన టార్గెట్ వైసీపీ మాజీ ఎంఎల్ఏ సాయిప్రసాద్ రెడ్డి!! ఆయన చేసిన భూకబ్జాలు..దౌర్జన్యాలు ఎన్నికల ప్రచారంలోనే కాదు అధికారంలోకి వచ్చాక కూడా సాయిని తన మాటలతో ఉతికి ఆరేస్తున్నారు. మరోవైపు తన మధురస్వరంతో అందరిని ఆకట్టుకుంటున్నారు. వినసొంపు స్వరం ఆయనకు దేవుడిచ్చిన వరం. సామాన్య ప్రజలకు ఏ కష్టమొచ్చినా వారి ఇళ్లముందు వాలిపోతున్నారు. తనకు అందరూ సమానమే అంటూ ఓ రోజు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల కాళ్లను పల్లెంలో కడిగి నీళ్లను తల మీదకు వేసుకున్నారు. నీళ్లతో కడిగిన కాళ్లను టవల్‌తో తుడిచాడు. ఇది చూసిన వారంతా నివ్వెరపోయారు. ఇది నిజమైన ప్రేమనా లేక మూడణాల యాక్షన్‌కు బదులు ఆరణాల యాక్షన్ చేస్తున్నారా..? ఆయన వెనకాల నవ్వులు పువ్వులు విరిసాయి. సరే ఏది ఏమైతేనేమి నిత్యం ప్రజల మధ్య ఉంటూ మనశ్శాంతి కోసమంటూ మసీదులు, చర్చీలు, గుళ్లు తిరుగుతూ ఎంఎల్ఏ డా.పార్థసారథి ప్రజల మనసుల్లో స్థానాన్ని సంపాదించుకున్నారు. ఐతే ఇంత పేరుప్రఖ్యాతలు సంపాదించుకుంటూ ‘తప్పు’లో కాలేశారు. తన స్నేహితుడు డాక్టర్ తన ఇంటి పక్కనే ఉన్న స్థలాన్ని భూకబ్జా చేసాడనే ఆరోపణలున్నా యి. ఆ స్థలం హక్కుదారులు తనకు అమ్మినట్టుగా తన తల్లి ఫోటోతో ఫ్రాడ్ చేసి రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లో చూపెట్టి ఆ స్థలాన్ని అక్రమంగా రిజిస్టర్ చేసేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. . ఐతే చిచ్చుబుడ్డిలా విషయం బయటకు పొక్కింది. భూకబ్జా వెలుగులు చిమ్మింది. వంకాయ బాణం పేలినంత శబ్దంతో భూకబ్జా కుంభకోణం ఎంఎల్ఏపై పేలింది. ఎంఎల్ఏకు తెలియకుండా సదరు డాక్టర్ ఫోర్జరీ సంతకాలు, స్వంత తల్లి ఫోటోలు పెట్టి మార్ఫింగ్ చేసుకునేంత ధ్యైర్యం డాక్టర్‌కు ఉందా? ఎంల్ఏ పార్థనే బినామి పేర్లతో భూకబ్జాలకు పాల్పడటం మొదలెట్టాడంటూ ప్రతిపక్షాలు గొంతు చించుకున్నాయి. దీంతో డా. పార్థకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. వెంటనే సబ్ రిజిస్ట్రార్‌ను పిలిపించి విచారణ చేసి రిజిస్టర్ డాక్యుమెంట్‌ను రద్దు చేయించారు సదరు ఎంఎల్ఏ! ఐతే ఇక్కడే నవభూమి ప్రతినిధి మేసా డేవిడ్ కలంలో నుంచి ప్రజలు వెలిబుచ్చిన అనేక అనుమానాలు కాకరపువ్వుల్లా విరజిమ్ముతున్నాయి. అసలు ఒకసారి రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌ను రద్దు చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్‌కు ఉందా? ఎంఎల్ఏ సబ్ రిజిస్ట్రార్‌ను పిలిపించి వెంటనే విచారణ చేసి నిజనిజాల నిగ్గు తేల్చి డాక్యుమెంట్‌ను రద్దు చేయమని సిఫార్సు చేస్తే సదరు అధికారి రద్దు చేసేస్తారా? మరి స్థలాన్ని రిజిస్టర్ చేసే ముందు డాక్యుమెంట్లు అన్నీ సరిగా ఉన్నాయా లేదా చూడకుండా రిజిస్టర్ చేసారా? ఈ లెక్కలో ఆదోని రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫాంను కూడా గుడ్డిగా రిజిస్టర్ చేసేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అసలు సబ్ రిజిస్ట్రార్‌ను పిలిపించి తప్పుడు డాక్యుమెంట్‌ను రద్దు చేయమనడానికి ఎంఎల్ఏ ఎవరు? కాగా తన పేరు బదలాం అవుతున్నప్పుడు ఎంఎల్ఏ ఖండిరచడంలో తప్పు లేదు. ఐతే డాక్యుమెంట్‌ను రద్దు చేయమని ఆదేశించడంతోనే లేనిపోని అనుమానాలు తలెత్తుతున్నాయి. తను సచ్ఛీలుడని నిరూపించుకోవడానికి ఖండన ఇస్తే సరిపోతుంది. కానీ ఏకంగా డాక్యుమెంటును రద్దు చేయమని ఆదేశించడం వెనుక ఉన్న మతలబు ఏంటీ? స్థలాన్ని రిజిస్టర్ చేసే అధికారం రిజిస్ట్రార్‌కు ఉంది. కానీ ఒకసారి రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌ను రద్దు చేసే అధికారం రిజిస్ట్రార్‌కు కూడా లేదు. ఐతే స్థలాన్ని రిజిస్టర్ చేసుకున్న వ్యక్తి రద్దు చేయమని కోరుకుంటే తప్పా రిజిస్టర్ డాక్యుమెంట్‌ను రద్దు చేసే అధికారం రిజిస్ట్రార్‌కు లేనే లేదు. ఒకవేళ రిజిస్టర్ చేసుకున్న డాక్టరే వచ్చి రద్దు చేయమని కోరినప్పుడు దొంగ దొరికినట్టే కదా? మరి పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు బుక్ చేయాలి కదా? చేసారా? తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అని ఎవరు తేల్చాలి? విచారణ చేసి పోలీసులు అయినా తేల్చాలి లేదా కోర్టు అయినా తేల్చాలి. కానీ ఇవేవి చేయకుండా సదరు డాక్టరే వచ్చి తప్పయిపోయింది.. రిజిస్టర్ డాక్యుమెంట్‌ను రద్దు చేయమంటే సబ్ రిజిస్ట్రార్ రద్దు చేసేస్తారా?ఈ లెక్కన అయితే ఒకడెవడ్కెనా మర్డర్ చేసి పోలీసు స్టేషన్‌కు వెళ్లి తప్పయిపోయింది క్షమించండి అంటే ఖూనికోర్‌ను వదిలేస్తారా? లేదు కదా? మరి ఇక్కడి భూమాయ సీన్‌లో ఒక డాక్డర్ అయి ఉండి తప్పుడు సర్టిఫికేట్లతో భూకబ్జా చేసి తర్వాత తప్పయిపోయిందంటూ రద్దు చేయమని కోరితే డాక్యుమెంట్‌ను రద్దు చేస్తారా? ఇదెక్కడి వింత? ఫ్రాడ్ జరిగిందా? లేదా? అన్నది సివిల్ కోర్టు నిర్ణయిస్తుంది. స్థలాన్ని పోగొట్టుకున్న బాధితుడు తన ఒరిజినల్ డాక్యుమెంట్లను చూపిస్తే కూడా అధికారులు రద్దు చేయరు. కానీ తప్పుడు రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డ డాక్టర్ వచ్చి రద్దు చేయమంటే మాత్రం రద్దు చేస్తారా? స్థలం పోగొట్టుకున్న బాధితుడ్కెనా సరే సివిల్ కోర్టుకు వెళ్లాల్సిందే తప్పా నేరుగా సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి రిజిస్టర్ డాక్యుమెంట్‌ను రద్దు చేయమని కోరలేడు. మరి ఇప్పుడు ఎవరి మీద పోలీసు క్రిమినల్ కేసు బుక్ చేయాలి? సదరు డాక్టర్ మీదనా? లేక సబ్ రిజిస్ట్రార్ మీదనా? అసలు ఎవరి ప్రోద్బలంతో రిజిస్ట్రార్ తప్పుడు డాక్యుమెంట్‌ను రిజిస్టర్ చేసారు? ఎంఎల్ఏ ప్రోద్బలం ఉండకపోదా అనే అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. లెజిస్లేచర్‌లో ఉండే వ్యక్తులు ఏది చెబితే అది అధికారులు చట్టానికి విరుద్ధంగా చేసేస్తారా? చట్టానికి అధికారులు లోబడరా? ఏ అధికారంతో ఒక సేల్ డీడ్‌ను సబ్ రిజిస్ట్రార్ రద్దు చేస్తారు? ఫ్రాడ్ జరిగిందని తేల్చినప్పుడు పోలీసు కేసు బుక్ చేయాలే తప్పా డాక్యుమెంట్‌ను రద్దు చేసే అధికారం అధికారికి లేదు. నిజంగా అధికారం ఉంటే సదరు సబ్ రిజిస్ట్రార్ జినయిన్ ఉండే వాటిని కూడా ఎన్ని రద్దు చేయడానికి వెనుకాడవారుకాదేమో! మరి డాక్టర్ ఫ్రాడ్‌కు పాల్పడ్డాడని సదరు సబ్ రిజిస్ట్రారే తేల్చినప్పుడు ఆయనపై క్రిమినల్ కేసు బుక్ చేసారా? అసలు సబ్‌రిజిస్ట్రార్ మీద కూడా క్రిమినల్ కేసు బుక్ చేయాలి. రిజిస్టర్ చేసేది ఆయనే.. రద్దు చేసేది ఆయనే అయినప్పుడు అటు డాక్టర్ మీద ఇటు సబ్ రిజిస్ట్రార్ మీద కేసు బుక్ చేయాల్సిందేనని పలువురు న్యాయవాదులు తెలుపుతున్నారు. ఎంఎల్ఏ రిజిస్టర్ చేయమంటే చేసేయడం... రద్దు చేయమంటే చేసేయడమేనా? చట్టానికి లోబడి ఉండాలని సదరు సబ్ రిజిస్ట్రార్‌కు తెలియదా? వాట్ ఈజ్ ది పవర్ ఆఫ్ సబ్ రిజిస్ట్రార్ టు క్యాన్సిల్ ది సేల్ డీడ్? అండర్ వాట్ పొజిషన్ ఆఫ్ లా హీ క్యాన్సల్డ్? ఏ సెక్షన్



కింద క్యాన్సిల్ చేసాడో సదరు సబ్ రిజిస్ట్రార్ చూపాలి? అసలు ఎంఎల్ఏకు .. సదరు డాక్టర్‌కు ఏం సంబంధం? ఎంఎల్ఏ ఎందుకు జోక్యం చేసుకోవాలి? తన పేరును సోషల్ మీడియాలో బదలాం చేస్తేంటే ఖండించాలే తప్పా రిజిస్టర్ డాక్యుమెంట్‌ను రద్దు చేయమని అధికారులను ఎలా ఆదేశించగలరు? ఇద్దరి మధ్య ఏ బంధం లేకపోతే అధికారులను పిలిపించి హరబిరిగా డాక్యుమెంట్‌ను చట్టానికి విరుద్ధంగా ఎందుకు రద్దు చేయించాల్సి వచ్చింది? క్రిమినల్ కేసు బుక్ చేయాలే తప్పా క్యాన్సిల్ చేసే హక్కు అధికారికి లేదు. సివిల్ కోర్టు రద్దు చేయాలే తప్పా హైకోర్టు, సుప్రీం కోర్టులు కూడా రద్దుచేయవు. ఇంతకూ క్రిమినల్ కేసు బుక్ చేసారా? చేస్తే సదరు డాక్టర్‌ను అరెస్టు చేసారా? అరెస్టు చేసి సామాన్యుడిని విచారణ చేసే స్టయిల్‌లోనే పోలీసులు విచారణ చేస్తే నిజాలు బయటకు రావా? సదరు డాక్టర్ వెనుక ఏ ఎంఎల్ఏ ఉన్నాడో నిజం బయటకు వస్తుందని హడావుడిగా డాక్యుమెంట్‌ను చట్టానికి విరుద్ధంగా రద్దు చేసారా? కనుక సదరు సబ్ రిజిస్ట్రార్‌ను కూడా క్రిమినల్ కేసులో ఎందుకు పార్టీగా చేర్చకూడదు? ఆదోనిలో ప్రసిద్ధి గాంచిన అవ్వ దేవాలయాన్ని వక్ఫ్ భూముల్లో కట్టారని రద్దు చేయమని ఏ లెజిస్లేటివ్ అయినా కోరితే రద్దు చేస్తారా? లేదు కదా? మరెందుకు డాక్టర్ కిరణ్‌కుమార్ డాక్యుమెంట్‌ను ఎలా రద్దు చేసారు? అధికారులే తెలపాలి. సివిల్ కోర్టులో కేసు ఉంటే అక్కడ కేసు ఎస్టాబ్లిష్ అయిన తర్వాత కోర్టు డైరక్షన్ మేరకు రిజిస్టర్ డాక్యుమెంటును రద్దు చేయాలే తప్పా నేరుగా రద్దు చేసేఅధికారం సబ్ రిజిస్ట్రార్‌కు లేదు. ఏది ఏమైనా ఎంఎల్ఏ ఒకటి గమనించాలి. ఒక ఎంఎల్ఏగా ప్రజల మధ్య మంచి పేరు సంపాదించుకుంటున్నా మరోవైపు ఇటువంటి కబ్జాల చేతిలో ఇరుక్కోవడం.. వెంటనే సరిదిద్దుకోవడం వంటివి ప్రజలు గమనిస్తున్నారు. అడుసు తొక్కనేల...కాలు కడగ నేల అనుకుంటున్నారు. డాక్టర్ ..పారా హుషార్! కొసమెరుపు ఏమిటంటే ఒక డాక్టర్ చేసిన భూకబ్జా మీద అటు ఎంఎల్ఏపై..ఇటు డాక్టర్‌పై అనేక అనుమానాలు ప్రజలకు తలెత్తుతున్నా ఇద్దరు మాజీ ఎంఎల్ఏలు మీనాక్షినాయుడు, సాయిప్రసాద్ రెడ్డిలకు మాత్రం ఎటువంటి అనుమానాలు రావు. అదేం చిత్రమో...తేలు కుట్టిన దొంగల్లా వారిద్దరు ఎందుకున్నారని ప్రజలనుకుంటున్నారు.

## బాణాసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండండి

### నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

### జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు,అక్టోబర్ 30, (నవభూమి)::** బాణాసంచా సామాగ్రి కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు.ప్రధానంగా చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటిల్లిపాది సంతోషంగా దీపావళి జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.జనం రద్దీగా ఉండే ప్రదేశాలు,కూడళ్ళలో బాణాసంచా కాల్చరాదని,అగ్నిమాపక సిబ్బంది వారి సూచనలు తప్పక పాటించాలన్నారు.చీకట్లను తొలగించి వెలుగులు నింపే దీపావళి అంటే విజయానికి ప్రతీక అని,జిల్లా ప్రజలందరి జీవితాలలో దీపావళి సరికొత్త వెలుగులు నింపాలని కలెక్టర్ ఆనంద్ ఆకాంక్షించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఒక ప్రకటనలో ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు చేరవేస్తూ,అన్ని రంగాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లను పారదొలినట్లు,ఒక్కొక్క మార్పును సాధించుకుంటూ ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకోవాలి

### తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి

**కౌతాళం, అక్టోబర్30(నవభూమి న్యూస్ ):** ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకోవాలని టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కౌతాళం టౌన్ లో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ధని అధ్యక్షతన జరిగిన తెలుగుదేశం %జ్ఞుఖఅ% పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు సభ్యత్వం నమోదు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం ఒక వరం అని అందరు కూడా సభ్యత్వం నమోదు చేసుకోవాలి అని సభ్యత్వం ఉంటే ఐదు లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. అలాగే మట్టి ఖర్చులకు పది వేల రూపాయలు ఇస్తారన్నారు. అలాగే పిల్లలు చదువు కు కూడా సహాయపడుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌతాళం టౌన్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ ధని,దమ్మలదిన్ని సర్పంచ్ రమేష్ గౌడ్, బాపురం వెంకటరెడ్డి,దోడ్డన్న గౌడ్, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి,బిసి సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్, యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి రాజా బాబు, బిసి సెల్ సాధికారిక రాష్ట్ర సభ్యులు సిద్దు, ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు, ఉమేష్ గౌడ్, తోవి గణేష్,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



### సమైక్య అకౌంట్‌లో నగదు నిల్

# మరొక చెక్ బౌన్స్

- ◆ డ్వాక్రాలో మరో అవినీతి పర్వం
- ◆ చెక్ బౌన్స్ కావడంతో ఉలిక్కిపడిన అమూల్య
- ◆ చెక్ పవర్ కలిగిన ఓబీల మాయాజాలం
- ◆ వివరణ అడుగగా స్పందించని డ్వాక్రా ఆర్.పి,ఓబీలు






**గుడివాడ నవభూమి అక్టోబర్ 30:–** ఓ సామాన్య అమూల్య శ్రీ గ్రూప్ సభ్యురాలు బలసా అలేఖ్య వ్యాపార నిమిత్తం కొన్ని నెలలుగా సమైక్య ఋణం డ్వాక్రా ఆర్.పి భవాని అడుగా ఈ నెల 17వ తేదీన చెక్ ఇవ్వడం జరిగింది.. 50 వేల రూపాయల సమైక్య చెక్ 18వ తారీఖున ఆర్పీ,ఓబీలు,గ్రూప్ సభ్యుల సమక్షంలో అందరి ఆమోదంతో ఎస్.బి.ఐ చెక్ ను యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ లో డిపాజిట్ చేశారు.. డిపాజిట్ చేసిన చెక్ క్లియరింగ్ కి వెళ్లి 28వ తారీఖున చెక్ బౌన్స్ అని తెలిపారు.. చెక్ బౌన్స్ అయిన సదరు 14వ వార్డ్ ఆర్.పి దుర్గా భవాని ని అడిగితే నాకేమి తెలియదు ఓబీలను అడగమని అన్నారు.. ఓబీలను అడిగితే చిల్లర డబ్బులు తక్కువ అయి ఉన్నాయని చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.. ఎప్పటికప్పుడు సమైక్య అకౌంట్ నందు కనీస నగదు 50 నుండి 70 రూపాయిలు నిర్వహించవలసిన బాధ్యత ఆర్.పి ,ఓబీలకు ఉంది.. కానీ చెక్ బౌన్స్ అయ్యే వరకు డబ్బులు అకౌంట్లో ఖాళీ చేస్తూ... ఓబీ చాపరాల విజయ లక్ష్మి గ్రూప్లో తీర్మానం చేసి, గ్రూప్ సభ్యురాలు బలసా అలేఖ్యకు చెక్ ఇష్యూ చేసిన, తరువాత సొంత అవసరాలకు గ్రూప్ సబ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా ఇటీవల లక్ష రూపాయలు చెక్కు జమ చేసి డ్రా చేసుకున్నారని 27 గ్రూపుల సభ్యులు ఒక్కరికొకరు చెవులు కొరికేసుకుంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...గుడివాడ పట్టణ పరిధిలో సుమారు 15 వందల డ్వాక్రా గ్రూపులు 80 ఆర్.పి లు కలిగిన డ్వాక్రాను అదుపు చేయలేని పరిస్థితిలో డ్వాక్రా ఉన్నత అధికారులు రోజుకో సమస్యతో కలవర పెడుతున్నా పట్టించుకోని జిల్లా స్థాయి అధికారులు ప్రజల పన్నులు రూపంలో చెల్లించిన సొమ్ములు జీతాలు గా తీసుకుంటూ నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు

### జాతి ఐక్యతకు పునాదులు వేసిన

# సర్దార్ వల్లభాయ్ పటేల్

## కలెక్టర్ వెంకట మురళి

**బాపట్ల–నవభూమి :** జాతి ఐక్యతకు పునాదులు వేసిన గొప్ప నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పరిష్కరించుకుని బుధవారం స్థానిక బాపట్ల పట్టణంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతోపాటు జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె పాల్ కుమార్, స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు ప్రదర్శన సాగింది. అనంతరం జాతి ఐక్యతపై విద్యార్థులు, ప్రజలతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. మనమంతా సోదర భావం ఐక్యతతో మెలగాలంటూ విద్యార్థులు చెయ్యి చెయ్యి పట్టుకుని మానవహారం నిర్వహించారు.ప్రజలంతా బేధాభిప్రాయాలను విడిచిపెట్టి జాతీయ ఐక్యత భావంతో మెలగాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. దాస్య శృంఖలాలలో చిక్కుకుని సంక్షోభంలో ఉన్న భారత దేశానికి స్వాతంత్రం కావాలని భగత్ సింగ్ నుంచి మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులు ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పారదోలిన గొప్ప మహనీయులు భారత్ లో ఉన్నారని చెప్పారు. స్వాతంత్రం ఇచ్చినట్లు బ్రిటిష్ వారు ప్రకటించినప్పటికీ 500 సంస్థానాలకు అధికారాలు ఇవ్వడంతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. వందలాదిమంది మృత్యువాత పడడంతో ఎంతో చాకచక్యంగా భారత తొలి ఉప ప్రధాని, కేంద్ర హెూం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవహరించారన్నారు. సంస్థానాలపై సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని ఉక్కుమనిషిగా సైనిక చర్యలతో జాతి ఐక్యతకు బాటలు వేశారని తెలిపారు. ఆయన చూపిన ఐక్యత మార్గంలో భారత్ నడుస్తూ ప్రపంచ దేశాల సరసన ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఏర్పడిందని అభివర్ణించారు. జాతి నాయకుల పోరాటాలు, ఉద్యమాల కృషితో దేశం పురోభివృద్ధిలో పయనిస్తుందన్నారు. జాతి మొత్తం ఐక్యతతో మెలగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్ డి ఓ పి.గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



# షాడో ఎమ్మెల్యే అంటూ అసత్య ప్రచారం తగదు

### రాజకీయ వ్యవహారాలలో నాకేమీ సంబంధం లేదు!?

### నన్ను దెబ్బతీయాలని కుట్ర పడుతున్నారు

### ఆ ఛానల్‌పై పరువు నష్ట దావా వేస్తా!

### రియల్ ఎస్టేట్ వ్యాపారి భాస్కర్ల చంద్రశేఖర్



**ఎమ్మిగనూరు, అక్టోబర్ 30 (నవభూమి):** ఎమ్మిగనూరు నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే అంటూ అసత్య ప్రచారాలు చేయడం తగదని రియల్ ఎస్టేట్ వ్యాపారి బాస్కర్ల చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కొన్ని ఛానల్లలో నన్ను షాడో ఎమ్మెల్యే,అంతా అతనే అంటూ నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నా.వ్యాపార పరంగా నాకు నష్టం కలిగే విధంగా ప్రచారాలు చేసిన మీడియా పై పరువు నష్ట దావా వేస్తున్నట్లు తెలిపారు.ఆ ఛానల్ల కు 3 రోజులు గడువు ఇస్తున్నాను.అంతలోగా నాపై చేసిన తప్పుడు ఆరోపణలను ఆధారాలుతో నిరిపించాలి.లేకపోతే న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.నేను గత 40 ఏళ్ల క్రితం మద్యం కాంట్రాక్టర్ గా వ్యాపారం కోసం ఎమ్మిగనూరు కు స్థిరపడ్డాను. వ్యాపారంలో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించాను.కానీ ఎవరి భూములు లాక్కోలేదు. ఎవరిపై దౌర్జన్యం చేయలేదు. వ్యాపారంలో నాకు గిట్టని వారు నన్ను దెబ్బతీయాలని కొందరు కుట్ర చేసి ఉండవచ్చు.అందులో మీడియా ను వాడుకొని లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారు.వారి మాటలు నమ్మి విలువను కోల్పోవద్దని సలహా ఇచ్చారు. అధికారులు ను కంట్రోల్ చేస్తున్నానని డబ్బులు వసూలు చేస్తున్నారని అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజమో సమాధానం చెప్పాలి. ఇసుక మద్యం,ఇటుకల బట్టీలు,ఎర్ర మట్టి వ్యాపారులు నుండి డబ్బులు తీసుకున్నట్లు చెప్పడం అవగాహన లేని మాటలు.గతంలోఎర్రకోట చెన్నకేశవ రెడ్డి.బాలనాగిరెడ్డి తో మంచి సంబంధాలు ఉన్నాయి.అదే సంబంధం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తో ఉంది.పెద్దల ఆశీర్వాదం ఉండాలనే ఉద్దేశ్యంతో వారితో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తుంటాను.మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి కు ఎన్టీఆర్,చంద్రబాబు నాయుడు తో నమ్మకమైన సంబంధం ఉండేది.అదే అనుబంధాన్ని బీవీ జయనాగేశ్వర రెడ్డి కొనసాగిస్తున్నారు.బీవీ మోహన్ రెడ్డి రికార్డు ను బ్రేక్ చేసి ఎమ్మిగనూరు ను అభివృద్ధి చేయాలనే సంకల్పం తో బీవీ ఉన్నాడు. దీనిని ఓర్వలేని కొందరు బురద జల్లుతున్నారు.40 ఏళ్ల నుండి నాపై ఎలాంటి ఆరోపణలు లేవు కేవలం 4 ఏళ్ల నుండి నిరాధార అసత్య ఆరోపణలు రావడం బాధాకరం. నేను తప్పు చేస్తే చట్టం చూస్తూ ఊరుకోదు.ఇప్పటి వరకు నాపై ఒక్క కేసు కూడా లేదు.నేను నిజాయితీగా ఉన్నాను అని చెప్పడానికి ఇదే ఉదాహరణ. నేను తప్పు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే.నాపై ఆరోపణలు అపోహలు వస్తే నిర్ధారణ చేసుకొంటే వాస్తవాలు తెలుస్తాయి.ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ గట్టు అల్తాఫ్,టిడిపి నాయకులు బందే నవాజ్ పాల్గొన్నారు.

# మండలంలో ఏపీ మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

### ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్

**కౌతాళం, అక్టోబర్ 30(నవభూమి న్యూస్ ):** మండలంలో ఏపీ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కౌతాళం మండలం లో అఖిలభారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఎమ్మార్వో కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తాలూకా నాయకులు గురు, మండల అధ్యక్షుడు సాయి వర్మ మాట్లాడుతూ కౌతాళం మండలంలో ఇప్పటివరకు ఏపీ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయలేదన్నారు. ఏపీ మోడల్ స్కూల్ లేకపోవడంతో ప్రైవేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కౌతాళం మండలంలో ఏపీ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మంత్రి నారా లోకేష్ కు యువగలం పాదయాత్రలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు యధావిధిగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. భోజన పథకాన్ని తొందరగా అమలయ్యే విధంగా చేయాలని కోరారు.ఎస్సీ మరియు బీసీ హాస్టల్ లను ఏర్పాటు చేయాలని, పెండింగ్ లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శివశంకర్, మండల కో కన్వీనర్ కే నాగరత్న, మండల నాయకులు మహేష్ , ఖాదర్ , స్కూలు విద్యార్థులు , కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### జిల్లా ప్రజలకు ఎస్పి తుషార్ డ్యూటీ

# దీపావళి శుభాకాంక్షలు



**బాపట్ల-నవభూమి :** సరైన జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సహాలతో దీపావళి పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రజలకు సూచించారు. ప్రజలకు, పోలీసు సిబ్బందికి, మీడియా మిత్రులకు ఎస్పీ బుధవారం దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపావళి.. చీకట్లను పారద్రోలి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణ సంచాను సరైన జాగ్రత్తలు పాటిస్తూ కాల్చాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చిన్నపిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్ద వాళ్ళు/తల్లితండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. బాణాసంచా కాల్చేటపుడు కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఇంటిలోపల బాణాసంచా కల్చరాదన్నారు. టపాకాయలను చేతిలో పెట్టుకొని కాల్చకూడదని, కొవ్వొత్తి, అగరబత్తి లాంటివాటిని టపాకాయలు కాల్చుటకు వినియోగించాలన్నారు. కాలని టపాకాయలను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని అది ప్రమాదకరమని హెచ్చరించారు. గాజు సీసాలు, ఇనుప రేకులతో కూడిన డబ్బాలలో బాణసంచా కాల్చడం చాలా ప్రమాదకరమన్నారు. గడ్డివాములు, గుడెసెల వద్ద టపాకాయలు కాల్చరాదన్నారు. టపాసులు కాల్చేటప్పుడు ముందు జాగ్రత్తగా ఎల్లప్పుడు నీటితో నిండిన బకెట్ ను దగ్గర ఉంచుకొనవలెనని సూచించారు. రోడ్డు వెంబడి వెళ్ళే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టపాసులు కాల్చుకోవాలన్నారు. వైద్య శాలల వద్ద బాణాసంచా కాల్చరాదన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే డైల్ 100, 101, 112 లకు కాల్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు.

# 'పేలుడు' ఘటనకు 20 ఏళ్లు

**శ్రీకాకుళం -నవభూమి:** దీపావళి వచ్చిందంటే చాలు.. చిన్నారులు, యువకుల్లో ఒకటే సందడి. నెలరోజుల ముందే నుంచే టపాసుల కొనుగోలు.. బాణసంచా తయారీతో బిజీబిజీగా గడుపుతారు. ప్రతి ఇంటా వెలుగులు నింపే.. బాణసంచాతో అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు తప్పవు. జిల్లాలో గతంలో పలుచోట్ల జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.- 2004 నవంబరు 4న జరిగిన దుర్ఘటనను శ్రీకాకుళం నగరవాసులతోపాటు.. జిల్లా ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. శ్రీకాకుళం నగరం చిన్నబజారు రోడ్‌లో పోలిశెట్టి సూరజ్ అనే వ్యక్తి.. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఇంటి వద్దే బాణసంచా సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు ఆ ఇంట్లో సంభవించిన భారీ పేలుడు ఘటనలో ఓ పసిపాపతో సహా 12మంది మృత్యువాత పడ్డారు. మరో ఇరవై మంది వరకు గాయపడ్డారు. పది కిలోమీటర్ల వరకు పేలుడు శబ్దాలు వినిపించాయి. చుట్టు పక్కల ఇళ్లు, వాపార సముదాయాల్లో ఉన్న గాజు సామాన్లు, అద్దాలు పగిలిపోయాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆ పేలుడు శబ్దాలకు ప్రజలు ఉలిక్కిపడ్డారు. దట్టమైన పొగ.. భారీ మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటి ఎస్పీ నాగిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమై మంటల్లో ఉన్న బాధితులను కాపాడే ప్రయత్నం చేశారు. ఈ దుర్ఘటనలో సూరజ్ భార్య, కుమార్తె, ఇద్దరు కోడళ్లతోపాటు అక్కడ పనిచేసే వారితో సహ 8 మంది దుర్మరణం చెందారు. 20 మంది తీవ్రంగా గాయపడగా.. వారిని శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి చెందారు. భారీ పేలుడు కారణంగా.. దూరంగా ఉన్న ఓ పసిపాప సైతం మృతి చెందింది.కానిస్టేబుల్ సైతం మృతి...ఓ వైపు మంటలు అదుపు చేస్తున్నా.. బాణసంచా సామగ్రి పేలుతుండడంతో ప్రజలు భయాందోళన చెందారు. బాణసంచా సామగ్రి వ్యర్థాలను ఓ లారీలో వేసి.. ఆర్ట్స్ కళాశాల వెనుక ఉన్న శాంతినగర్ కాలనీలో నది సమీపంలో దంపింగ్ చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా.. దంపింగ్ సమయంలో మరోసారి పేలుడు సంభవించింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న గార స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు సుందరరావు, రామచంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి శ్రీకాకుళం సీఐ కృష్ణమూర్తి నాయుడు, వన్‌టౌన్ ఎస్ఐ ఎం.అప్పారావు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన కానిస్టేబుళ్లను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుందరరావు మృతి చెందారు. ఇలా 20 ఏళ్ల కిందట జరిగిన దుర్ఘటన పలు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది.2005లో.. నువ్వలరేవులో బాణసంచా విస్ఫోటనం వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో 2005 ఏప్రిల్ 19న జరిగిన బాణసంచా విస్ఫోటనంలో పది మంది మృతి చెందారు. 26 మంది గాయపడ్డారు. బాధితులలో అధికమంది చిన్నారులే. ఈ గ్రామంలో ఏటా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు రావణుడి బొమ్మను బాణసంచా సామగ్రితో దహనం చేసే వారు. ఈ ఉత్సవాలను చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేవారు. ఒడిశా నుంచి బాణసంచా సామగ్రి తయారు చేసేవారిని తెప్పించేవారు. కాగా.. నాడు పాఠశాల భవనంలో బాణసంచా తయారీ చేస్తుండగా పేలుడు సంభవించి ప్రమాదం చోటుచేసుకుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు పరిహారం అందలేదని బాధితులు తెలిపారు. అప్పటి నుంచీ శ్రీరామనవమి ఉత్సవాల్లో బాణసంచా వినియోగం నిషేధించామని గ్రామస్థులు వివరించారు. ఈ ఘటనతో దీపావళి నాడు బాణసంచా వినియోగించుకునేందుకు గ్రామస్థులు భయపడుతుంటారు.



# పారిశుద్ధ్య కార్మికులకు నిత్యవసర కిట్లు పంపిణీ చేసిన సర్పంచ్ కళావతి



**మాడుగుల అక్టోబర్ 30 నవభూమి** మాడుగుల : మండల కేంద్రం మాడుగుల లో నిత్యం గ్రామం లోని పరిశుభ్రత కు కృషి చేస్తున్న 29 మంది పారి శుద్య కార్మికులకు నిత్యవసర వస్తువుల ను గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం పరి శుభ్రంగా ఉన్నాదంటే అది ఈ కార్మికుల వలనే అని అన్నారు. దీపావళి పండుగ ను పురస్కరించుకుని కార్మికులకు నిత్యవసర సరుకుల కిట్లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమం లో ఈఓ. కె.మూర్తి బాబు , మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాస రావు , ఉప సర్పంచ్ వరహాలు పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలలకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బండారు



**మాడుగుల అక్టోబర్ 30 నవభూమి** మాడుగుల : నియోజక వర్గం లో నాలుగు మండలాల్లోని కేజీబీవి పాఠశాల లకు నిధులు మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం తెలిపారు. మొత్తంగా నాలుగు మండలాల కు 115.6 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరు కావడం ద్వారా ఆయా పాఠశాల లో కంప్యూటర్ గదులు , గ్రంథాలయ గదులు , ఆర్ట్ క్రాఫ్ట్ గదులు నిర్మించడం జరుగుతుందని తెలిపారు.త్వరలోనే ఈ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.ఈ మొత్తం లోని నాలుగు మండలాల్లోని కేజీబీవ్ పాఠశాలలో కంప్యూటర్ గదులు నిర్మిస్తామని ఆయన తెలిపారు.

# వరి పంటను ఆశిస్తున్న చీడ పురుగులు

**మాడుగుల అక్టోబర్ 30 నవభూమి** మాడుగుల : మండలం లోని వీ జే పురం , జంపెన గ్రామాలలో మంగళవారం పొలం బడి కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ రావు సమక్షం లో వరి పంట పొలాలను క్షేత్ర సందర్శన చేసి వరి కి చీడ పురుగులు ఆశిస్తున్నట్లు ఆయన గుర్తించారు.అనంతరం వరి పంట రైతుల తో సమావేశం నిర్వహించారు. వరి పంట ను ఆశిస్తున్న చీడ పురుగుల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసారు. పంట రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంక్ వారే భీమా ప్రీమియం చెల్లిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.




# వాడి..వేడిగా కౌన్సిల్ సమావేశం



**అద్దంకి, అక్టోబర్ 30 (నవభూమి)** అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు బుధవారం చైర్మన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం వాడి వేడిగా జరిగింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్ల మాటల తూటాలతో సమావేశం హీటెక్కింది. మొదట సమస్యల ప్రస్తావనతో ప్రారంభమైన సమావేశం చిలికి చిలికి గాలి వానలా మారి రసా..బసాగా మారింది. మొదట వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, శానిటేషన్ సక్రమంగా లేదని పలువురు టిడిపి కౌన్సిలర్లు సమావేశంలో కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసిన ఇంతవరకు లైట్లు బిగించలేదని వారు ప్రస్తావించారు. ఈ తరుణంలో తమ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సారథ్యంలో పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లో పనులు జరుగుతున్నాయని టిడిపి కౌన్సిలర్లు ప్రస్తావించగా, తాము అధికారంలో ఉన్నప్పుడు కూడా పార్టీలకు అతీతంగా పనులు చేశామని వైసిపి కౌన్సిలర్లు తెలపటంతో వాదోపవాదాలు ప్రారంభమయ్యాయి. ఒకానొక దశలో మంత్రి పరువు మీరే తీస్తున్నారంటూ వైసీపీ కౌన్సిలర్లు మాటల తో ఎదురు దాడికి దిగారు. చివరికి అజెండాలోని తీర్మానాలు ఆమోదంతో కౌన్సిల్ సమావేశం ముగిసింది.

# దీపావళి స్టాల్స్‌ను పరిశీలించిన...ఖాదర్ బాషా

**అద్దంకి, అక్టోబర్ 30 ( నవభూమి )** అద్దంకి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు వ్యాపారస్తులు ఏర్పాటుచేసిన దీపావళి స్టాల్స్ ను బుధవారం ఎస్సై ఖాదర్ భాషా పరిశీలించారు. ప్రతి స్టాల్స్ దగ్గర నిర్వాహకులు డ్రమ్ముల్లో ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని ఆయన వారికి సూచించారు. నిబంధనలకు అనుగుణంగా పోలీస్ వారికి సహకరించాలని ఎస్సై ఖాదర్ భాషా తెలియజేశారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలందరూ సంతోషంగా దీపావళి పండుగలు జరుపుకోవాలని ఆయన తెలియజేశారు.






# రాకపోకలకు ఇబ్బంది లేకుండా వంతెన నిర్మాణం



**గోకవరం, –నవభూమి:** వాహనాల రాకపోకలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా గోకవరంలోని ఠాణా సెంటర్ సమీపంలో వంతెన నిర్మాణం జరుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఠాణా సెంటర్ సమీపంలో బ్రిటిష్ కాలం నాటి వంతెనను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఠాణా సెంటర్‌లోని వంతెన 1905వ సంవత్సరంలో నిర్మించినదని, ఈ వంతెనతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నా రన్నారు. జాతీయ రహదారుల నిబంధనలు ప్రకారం వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. ఎటువంటి మలుపులు లేకుండా వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. అవస రమైతే సీఎం చంద్రబాబు సహకారంతో కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జిని నూతన విధానంతో నిర్మిస్తామన్నారు.

# సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలి : ఎస్పీ

**కాకినాడ –నవభూమి:** ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాల నియంత్రణ కోసం విస్తృ తంగా అవగాహన సమావేశాలు కల్పించాలని, బాధితులు తక్షణమే 1930కు ఫోన్ చేసి రక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకునేలా చర్య లు తీసుకోవాలని, ఎక్కడా అగ్ని ప్రమాదం జరక్కుండా ముందస్తు నివారణ చర్యలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి అక్ర మ రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రహదారి భద్రతకు పెద్దపీట వేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చే యాలన్నారు. చోరీలు జరక్కుండా రాత్రి గస్తీ మరింత పెంచాలని ఆదేశించారు. మహిళల రక్షణ కోసం త్వరలో మహిళా రక్షక్ వాహనా లు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఈ వాహనాల వల్ల అన్ని విద్యాసంస్థలు, పార్కుల్లో మహిళలు సంచరించే ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించడం ద్వారా రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈమధ్య కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని, లేనిఎడల 1930 నెంబర్‌కు ఫోన్ చేసి రక్షణ పొందాలని కోరారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, డీసీఆర్, డీటీఆర్, ఐటీ కోర్, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

